www.dainamicnews.com

శుభోదయ

# డైనమిక్

ప్రజల కోసం - ప్రగతి కోసం

dianamicnews Tv
dianamicnews.epaper.com

**విలేకరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న డైనమిక్ దినపత్రికలో అన్ని మండలాల వారీగా విలేకరులు కావలెను.

డైనమిక్

CELL : 96523 03089

తెలంగాణా- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 | వెల : 4/-



## వైఎస్ పేదల కోసం గుర్తించిన స్థలాలు నెల రోజుల్లో ఇస్తాం

- 2024లో రాష్ట్ర ప్రభుత్వం సర్వే పూర్తి చేసి, ఆవాస్ యోజన అర్హత కలిగిన 11,56,929 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం
- రాష్ట్ర ప్రభుత్వం 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోంది
- భవిష్యత్‌లో అర్హులకు మూడు, నాలుగో విడతలో కూడా ఇళ్లు ఇవ్వాలని ఆలోచిస్తోంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

# ‘సర్’తో ప్రమాదం!



- ఈ ప్రమాదం వెనుక ఉన్న ఆంతర్యాన్ని నేతలు గ్రహించాలి
- ‘సర్’ ప్రక్రియను తీవ్రంగా పరిగణించాలి..అర్హులైన వారి ఓట్లు కాపాడాలి
- దేశ వ్యాప్తంగా 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి
- ఓట్ల తొలగింపు ప్రమాదం మన దరిదాపులకు రానీయొద్దు
- ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి
- శాసనసభ జరగకుండా ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన కుట్ర
- అసెంబ్లీ ఘటనలపై ఫ్లాష్ సర్వేలో కాంగ్రెస్‌కు చాలా పాజిటివ్‌గా వచ్చింది
- సభ జరిగినన్ని రోజులూ కాంగ్రెస్ సభ్యులు పూర్తిగా హాజరు కావాలన్న సీఎం

హైదరాబాద్

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ద్వారా ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదం వెనుక ఉన్న ఆంతర్యాన్ని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు గ్రహించాలని చెప్పారు. ఎస్ఐఆర్‌ను చాలా సీరియస్‌గా తీసుకోవాలని అన్నారు. ఈ విషయం ఇప్పటికే పలుమార్లు చెప్పానని, ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను - మిగతా3లో




## ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు

- సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ
- ఈ వారాంతంలో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- సర్వం సిద్ధం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్
- హాజరుకానున్న రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్
- రాజధానిలో 15,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- భారత్‌కు ఇది నాలుగోసారి అధ్యక్ష బాధ్యత

# ఫ్యూచర్ లేని సిటీ




- ఫ్యూచర్ లేని సీఎం తన సోదరులతో కలిసి రియల్ ఎస్టేట్ నాటకం ఆడుతున్నారు
- ఇందులో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు..బలి పశువులు కావొద్దు
- టెస్సెరాక్ట్ కంపెనీకి ఏటా రూ.లక్ష కూడా టర్నోవర్ లేదు
- రూ.250 కోట్లు విలువ చేసే భూములను రూ.7 కోట్లకే కట్టబెట్టడంపై కోర్టులను ఆశ్రయిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మహేశ్వరంలో టెస్సెరాక్ట్ కంపెనీకి కేటాయించిన భూమిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

## అంతరిక్షం అందరిదీ,.. బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి

- పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌లో మోదీ వర్చువల్ ప్రసంగం
- అంతర్జాతీయ చట్టాల ఆధారంగా సురక్షిత, శాంతియుత, సుస్థిర అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు
- ‘శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తికి స్ఫూర్తినిచ్చింది
- ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత భూమిపై జీవన విధానాన్ని ప్రభావితం చేస్తోంది





## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం

- కార్గో నౌకలో 20 మంది మృతి
- చైనాలోని కింగ్‌డావో షిప్‌యార్డ్‌లో కార్గో నౌకలో భారీ అగ్నిప్రమాదం
- ఈ దుర్ఘటనలో 20 మంది సిబ్బంది మృతి, ఐదుగురు గల్లంతు
- మరమ్మతుల కోసం ఆగిన ‘ఓషన్ మెలోడీ’ నౌకలో ఘటన
- సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశం

# నినాదాల హోరు.. పాటల జోరు

- శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యుల నిరసన
- ‘22ఏ’పై వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్ష ఎమ్మెల్సీలు
- ప్రశ్నోత్తరాల సమయంలో చర్చకు పట్టు...
- వాయిదా తీర్మానం తిరస్కరించినట్లు చైర్మన్ ప్రకటన
- నిరసనగా వాకౌట్ చేసిన బీఆర్ఎస్ సభ్యులు



హైదరాబాద్

బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు...నిరసన పాటలతో గురువారం శాసన మండలిలో గందరగోళం నెలకొంది. నిషేధిత భూముల (22ఏ) అంశంపై చర్చకు వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్ష సభ్యులు దానిపై చర్చకు పట్టుబట్టారు. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఈ వాయిదా తీర్మానాన్ని అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పోడియం వైపు దూసుకొచ్చి నినాదాలు, నిరసన పాటలతో హోరెత్తించారు. తీర్మానం తిరస్కరిస్తున్నట్టు చైర్మన్ ప్రకటించడంతో నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. గురువారం మండలి ప్రారంభమైన వెంటనే చైర్మన్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. అయితే 22ఏ అంశంపై ఇచ్చిన వాయిదా తీర్మానం చర్చకు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో - మిగతా3లో



## 18 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగం

- కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు
- పిల్లల ఆన్‌లైన్ భద్రతపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- మైనర్లు సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించడంపై రక్షణ చర్యలు కోరుతూ పిటిషన్
- దీనిపై కేంద్రానికి నోటీసులు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం

## జల విద్యుత్ ప్రాజెక్టులపై సోలార్ విద్యుత్

- నీటిపారుదల, విద్యుత్ శాఖల సమన్వయ కృషి
- సభలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి
- సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు వ్యయం ఎక్కువ అవుతుంది
- సౌర విద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాం



హైదరాబాద్

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని సౌర విద్యుత్, జలాశయాలపై తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శాసనసభలో గురువారం ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, కసిరెడ్డి నారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ప్రాజెక్టులకు సంబంధించి విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని - మిగతా3లో

## రిజిస్టర్డ్ పార్టీగా టీవీకే ఈసీ అధికారిక గుర్తింపు

- ప్రజలకు విజయ్ కృతజ్ఞతలు
- తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ఎన్నికల సంఘం గుర్తింపు
- తమిళనాడు, పుదుచ్చేరిలో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీగా గుర్తింపు



# పాఠశాల ఆవరణలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

**బాలాలయం పేరుతో నిర్మించిన తాత్కాలిక కట్టడం ఆక్రమణకు గురైందని ఆరోపణలు**

**బోర్ పక్కనే మరుగుదొడ్డి నిర్మాణంతో తాగునీరు కలుషితమవుతోందని విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన**

**చిలుకూరు, సెప్టెంబర్ 10:** చిలుకూరు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం, ప్రాథమిక పాఠశాల ఆవరణలో అక్రమ నిర్మాణాలపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. గతంలో దేవాలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా తాత్కాలికంగా బాలాలయం నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. అయితే నూతన దేవాలయం నిర్మించి ప్రతిష్ఠ కార్యక్రమాలు పూర్తయి సుమారు రెండేళ్లు గడిచినా, ఆ తాత్కాలిక నిర్మాణాన్ని తొలగించకుండా ప్రస్తుతం వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాఠశాలకు రాకపోకలు సాగించే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాల ఆవరణలోని బోర్‌కు సమీపంలోనే మరుగుదొడ్డి నిర్మించడం వల్ల తాగునీటి భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. బోర్ చుట్టూ పరిశుభ్రత లోపించడం, మురుగు నీరు కలిసే అవకాశం ఉండటంతో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల కొంతమంది చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. పాఠశాల ఆవరణ విద్యార్థుల భద్రత, ఆరోగ్యానికి అనుకూలంగా ఉండాల్సిన నేపథ్యంలో వ్యక్తిగత వినియోగానికి నిర్మాణాలు చేపట్టడం సరికాదని స్థానికులు అంటున్నారు. సంబంధిత విద్యాశాఖ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించి, నిర్మాణాలపై



వాస్తవాలను నిర్ధారించాలని వారు కోరుతున్నారు.
విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల ఆవరణలోని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి, బోర్ నీటి నాణ్యతను పరీక్షించి, ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని వారు కోరుతున్నారు.

## నినాదాల హోరు.. పాటల జోరు

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ, దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, వాణీదేవి, నవీన్‌రావు తదితరులు వెల్‌వైపు దూసుకొచ్చారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ చర్చకు పట్టుబట్టారు. ప్లకార్డులు తీసేయాలని చైర్మన్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా వెనక్కి తగ్గలేదు.

**నినాదాల హోరు**

'కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడదాం..ముఖ్యమంత్రి భూ దోపిడీ నశించాలి..సీఎం కుటుంబ సభ్యులకు కేటాయించిన భూములను రద్దు చేయాలి..22ఏ నిషేధిత భూముల అంశంపై వెంటనే చర్చ చేపట్టాలి..'అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదా లు చేశారు. వారు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లకుండా మార్షల్స్ అడ్డుకున్నారు. ఈ సమయంలో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకున్నారు.
ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే సభ మర్యాద పాటిస్తూ నిబంధనలు పాటించాలని సూచించారు. మరోవైపు ప్రశ్నోత్తరాలు కొనసాగించడంతో బీఆర్ఎస్ సభ్యులు పోడియం వద్దే నిలబడి తమ నిరసన కొనసాగించారు. దేశపతి శ్రీనివాస్, గోరటి వెంకన్న కాంగ్రెస్ పార్టీ విధానాలు, సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నిరసన పాట లు పాడారు. దీనికి మిగిలిన ఎమ్మెల్సీలు చ ప్పట్లతో కోరస్ ఇచ్చారు. దీంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. చైర్మన్ వారించినా బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. అయినా ప్రశ్నోత్తరాలను కొనసాగించారు.

**నినాదాల కాగితం ప్రదర్శించిన శంభీపూర్ రాజు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు.. తీన్మార్ మల్లన్న పక్క సీటులోకూర్చుని అకస్మాత్తుగా తన జేబులోంచి 'బామ్మర్దికి అమృత్ టెండర్లు, తమ్ముడికి రావిరాల భూములు.. రైజింగ్ ఎనుముల ఫ్యామిలీ'అని నినాదాలు రాసి ఉన్న కాగితాన్ని ప్రదర్శించారు. దీనిపై చైర్మన్ గుత్తా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు తమ స్థానాల్లో కూర్చుంటే ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానంపై చర్చించే అవకాశం ఇస్తానని ప్రకటించారు. కాసేపటి తర్వాత ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో..22ఏ అంశంపై బీఆర్ఎస్ ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరిస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు.

## జల విద్యుత్ ప్రాజెక్టులపై సోలార్ విద్యుత్

-మొదటిపేజీ తరువాయి



వివరించారు. త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, కుమురంభీం, పాలేరు, వైరా, మల్లన్నసాగర్, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, పోచారం వంటి జలాశయాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు వ్యయం ఎక్కువ అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద మెగావాట్‌కు రూ.కోటి వరకు సహాయం అందించే పథకాన్ని ప్రకటించినా, అందులో కొన్ని ఇబ్బందులున్నాయన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని భట్టి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు 15 వేల మెగావాట్లు గరిష్ఠ డిమాండ్ ఉంటే, ఈ నెల 9వ తేదీన అది 19 వేల మెగావాట్లకు చేరిందన్నారు.

**సోలార్ గ్రిడ్ ఏర్పాటు**

అమ్రాబాద్‌లో సోలార్ పైలెట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి వెల్లడించారు. 80 గ్రామాలను పూర్తిగా సోలరైజ్ చేసి, అక్కడ మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ కింద గతంలో పంపిణీ చేసిన సుమారు 6.70 లక్షల ఎకరాలను కూడా సౌర విద్యుత్ ప్రోత్సాహానికి వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం'పేరుతో పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## వైఎస్ పేదల కోసం గుర్తించిన స్థలాలు నెల రోజుల్లో ఇస్తాం

**హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిరుపేదలకు ఇవ్వడానికి గుర్తించిన ప్రభుత్వ స్థలాలను లేఅవుట్ చేసిన వాటిని నెల రోజుల్లో పేదలకు ఇచ్చే ప్రయత్నం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శాసనసభలో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన అంశాన్ని పలువురు సభ్యులు లేవనెత్తారు. సభ్యుల సందేహాలకు మంత్రి సమాధానమిస్తూ, 2024లో రాష్ట్ర ప్రభుత్వం సర్వే పూర్తి చేసి, ఆవాస్ యోజన అర్హత కలిగిన 11,56,929 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. ఇది ఇప్పటికే పెండింగ్‌లో ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు. భవిష్యత్‌లో అర్హులకు మూడు, నాలుగో విడతలో కూడా ఇళ్లు ఇవ్వాలని ఆలోచిస్తోందని తెలిపారు.

**సమస్యలున్నాయి: రాజగోపాల్‌రెడ్డి**

చిన్న చిన్న కారణాల వల్ల అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బతుకు దెరువు కోసం వాహనాలు కొనుక్కొన్నారని, అవి ఎప్పుడో పోయాయని, వారిని అనర్హులను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ఇళ్లు ఇస్తున్నామనేది కాదని, ఎంతమంది అర్హులకు ఇస్తున్నామన్నదే ముఖ్యం కావాలన్నారు. చర్చలో మనోహర్‌రెడ్డి, అక్బరుద్దీన్, మేడేపల్లి సత్యం, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

**అగ్రి పాలిటెక్నిక్ కాలేజీలను మెరుగుపరుస్తాం: మంత్రి తుమ్మల**

రాష్ట్రంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలను ఆధునీకరిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి

## నల్గొండ జిల్లాలో 12న జాతీయ లోక్ అదాలత్

**నల్గొండ బ్యూరో, శుభోదయ దైనమిక్** జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న శనివారం జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. హిమబిందు తెలిపారు. నల్గొండ, మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, నిడమనూరు కోర్టుల్లో ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కక్షిదారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెండింగ్ కేసులు, వివాదాలను పరిష్కరించుకోవాలని కోరారు.

## ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులుగా జాన్ విల్సన్ నియామకం



**శుభోదయ దైనమిక్ న్యూస్, సెప్టెంబర్10, సూర్యాపేట :** మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులుగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన చింత జాన్ విల్సన్ నియమితులయ్యారు.ఈయన 2004 లో ఎస్సీ వర్గీకరణ పోరాటంలో బాగంగా అట్టి వర్గీకరణను సుప్రీంకోర్టు రద్దు చేసిన సమయంలో ఎంఈఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పని చేశారు.2005 లో ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జిగా, జిల్లా కార్యదర్శిగా, 2011 లో ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా , 2016 లో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా , 2022 లో రాష్ట్ర కోశాధికారిగా పని చేసిన జాన్ విల్సన్ సేవలను గురించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జాన్ విల్సన్ ని 2026 లో మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. ఆయన నియామకం పట్ల పలువురు ఉద్యోగులు, స్నేహితులు, పట్టణ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ ఎంఈఎఫ్ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉద్యోగుల సంఘ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తన నియామకాన్ని ధృవీకరించన మంద కృష్ణ మాదిగకు ధన్యవాదాలు తెలిపారు.

## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం..

చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల



నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

## 18 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగం



సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికలను వినియోగించే పిల్లల భద్రతకు మరింత పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 18 ఏళ్లలోపు పిల్లలతో డిజిటల్ ప్లాట్?ఫామ్?లు నేరుగా ఒప్పందాలు చేసుకోకుండా తగిన నియంత్రణలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణకు అంగీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం, కేంద్రం, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. భారత్‌లో కొన్ని రక్షణ చర్యలు అవసరమని విచారణ సందర్భంగా ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది.
'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు ఈ పిటిషన్?ను దాఖలు చేసింది. సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది హెచ్?ఎస్? ఫూల్కా వాదనలు వినిపించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వయసు నిబంధనలు, భారత చట్టాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పిటిషన్?లో ప్రధానంగా ప్రస్తావించారు. ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి కొన్ని వేదికలు 13 ఏళ్ల వయసు నుంచే ఖాతాలు తెరవడానికి అవకాశం కల్పిస్తున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. భారత చట్టాల ప్రకారం 18 ఏళ్లలోపు వారంతా మైనర్లుగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లలు డిజిటల్ వేదికలపైకి ప్రవేశించినప్పుడు వారి వయసును సక్రమంగా నిర్ధారించడం, వారి వ్యక్తిగత సమాచారాన్ని రక్షించడం, ప్రమాదకర కంటెంట్ నుంచి వారిని కాపాడటం వంటి అంశాలపై స్పష్టమైన నియమాలు అవసరమని పిటిషన్ పేర్కొంది.

**సీఎస్ఏఎం కట్టడికి మరింత పటిష్ఠ చర్యలు**

చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూజ్ మెటీరియల్ (జూజూావీ)కు సంబంధించి దేశంలో కఠినమైన శిక్షా నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని సమర్థంగా అమలు చేయడంలో

## గుప్త నిధుల కోసం అక్రమ తవ్వకాలు.. 8 మంది అరెస్ట్



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ దైనమిక్** ఉండ్రుగొండలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పురాతన ఆలయాల పరిసరాల్లో గుప్త నిధుల కోసం అక్రమంగా తవ్వకాలకు ప్రయత్నించిన 10 మందిలో 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.సమాచారం మేరకు ఈ నెల 6న తెల్లవారుజామున కేషరాజు కుంట కట్ట వద్ద తవ్వకాలు చేస్తుండగా పోలీసులు గుర్తించారు. వారి నుంచి మెటల్ డిటెక్టర్, స్కానర్, లొకేటర్, 6 సెల్‌ఫోన్లు, ట్యాబ్, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. దేవాలయ ఛైర్మన్ చకిలం కృష్ణకుమార్ ఫిర్యాదుతో ఎస్ఐ మహేశ్వర్ కేసు నమోదు చేశారు. సీఐ జి. రాజశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది.గుప్త నిధుల పేరుతో జరిగే మోసాలను నమ్మవద్దని, అనుమానాస్పద తవ్వకాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ దైనమిక్** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి తరతరాలకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అణచివేత, భూస్వామ్య వ్యవస్థకు ఎదురొడ్డి ఐలమ్మ చూపిన ధైర్యాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

**పోరాట స్ఫూర్తి ఆదర్శం**

జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెగువ, పోరాట స్ఫూర్తి నేటి సమాజానికి ఆదర్శమన్నారు. మహిళలు అన్యాయాలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తూ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళా భద్రత, చైతన్యంపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, అధికారులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు




**సూర్యాపేట బ్యూరో, శుభోదయ దైనమిక్** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా గతేడాదితో పోలిస్తే రెట్టింపు స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ కె. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాట్లపై సమీక్షించారు.నీటి లభ్యత తక్కువగా ఉన్నందున పరిస్థితులకు అనుగుణంగా నిమజ్జన ప్రాంతాలను ఎంపిక చేయాలని సూచించారు. నిమజ్జన రూట్‌మ్యాప్, ట్రాఫిక్ డైవర్షన్ వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద బ్యారికేడ్లు, క్రేన్లు, లైటింగ్, తాగునీరు, వైద్య శిబిరాలు, గజ ఈతగాళ్లు, పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.విద్యుత్ ప్రమాదాలు జరగకుండా మండపాల్లో తనిఖీలు చేపట్టాలని, విగ్రహాల తరలింపు మార్గంలో విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలను సర్దుబాటు చేయాలని సూచించారు. రోడ్డు మరమ్మతులు, అప్రోచ్ రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించాలని తెలిపారు.నిమజ్జనం సందర్భంగా మద్యం విక్రయాలను నియంత్రించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఉత్సవ కమిటీలు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని కోరారు.

## గ్రామాభివృద్ధి పనులకే ప్రాధాన్యం




**నల్గొండ బ్యూరో, శుభోదయ దైనమిక్** విబిజి రాంజీ కింద గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులకే ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయాదిత్య భవన్‌లో ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీవోలు, పంచాయతీరాజ్ అధికారులకు నిర్వహించిన ఓరియంటేషన్‌లో ఆయన మాట్లాడారు.గ్రామాల్లో పనుల సంఖ్య పెంచడంతో పాటు కూలీల సంఖ్యను పెంచి మెటీరియల్ కాంపోనెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, కిచెన్ షెడ్లు, అదనపు తరగతి గదులు, ప్రహరీలు వంటి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ, సోక్‌పిట్ల పనులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, డీపీఓ తరుణ్ చక్రవర్తి, డీఎఫ్ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం ఆరోపణలపై అధికారుల మౌనం ఎందుకు?

## ఉపాధ్యాయుడి డ్రింకింగ్ టెస్ట్‌లో 196గా నమోదైందన్న వార్తపై చర్యలు ఎక్కడ?

## ఎంఈఓ పంపానంటున్నారు.. డీఈఓ కార్యాలయానికి రాలేదంటోంది!



**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు మద్యం సేవించి విధులకు హాజరయ్యారన్న ఆరోపణలు, డ్రింకింగ్ టెస్ట్‌లో 196గా నమోదైనట్లు వచ్చిన వార్త స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై గతంలో వార్తలు వచ్చినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంపై తల్లిదండ్రులు, స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

**రిపోర్ట్ పంపానంటున్న ఎంఈఓ.. రాలేదంటున్న డీఈఓ**


ఈ వ్యవహారంపై ఎంఈఓను వివరణ కోరగా, తాను పూర్తి వివరాలతో కూడిన రిపోర్ట్‌ను పై అధికారికి, డీఈఓకు పంపించానని చెబుతున్నట్లు సమాచారం. అయితే డీఈఓ స్థాయి నుంచి మాత్రం తమకు ఇప్పటివరకు ఎలాంటి రిపోర్ట్ అందలేదని చెబుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అసలు రిపోర్ట్ ఎక్కడికి వెళ్లింది? ఎప్పుడు పంపారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఎంఈఓ రిపోర్ట్ పంపినట్లు చెబుతుండగా, డీఈఓ కార్యాలయానికి రిపోర్ట్ అందలేదని చెప్పడం అధికారుల మధ్య సమన్వయంపై అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో వాస్తవాలను అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**సమాచారం ఇవ్వడమేనా.. తదుపరి చర్యలు ఏవి?**

ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలు నిజమా కాదా అనేది తేల్చాల్సిన బాధ్యత సంబంధిత విద్యాశాఖ అధికారులదే. రిపోర్ట్ పంపినట్లయితే దానిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? విచారణ చేపట్టారా? అనే విషయాలను వెల్లడించాల్సి ఉంది."రిపోర్ట్ పంపాం" అని ఎంఈఓ చెబుతుండగా, "రిపోర్ట్ రాలేదు" అని డీఈఓ స్థాయి నుంచి సమాచారం వస్తే ఈ వ్యవహారం ఎక్కడ నిలిచిపోయిందో అధికారులు చెప్పాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**విద్యార్థుల భద్రతపై స్పష్టత కావాలి**

పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయుడిపై మద్యం సేవించి వచ్చినట్లు ఆరోపణలు రావడం సాధారణ విషయం కాదని స్థానికులు పేర్కొంటున్నారు. ఆరోపణలు నిజమైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే విచారణ ద్వారా వాస్తవాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు.ఈ వ్యవహారంలో రిపోర్ట్ పంపిన తేదీ, అందిన తేదీ, దానిపై చేపట్టిన చర్యలు ఏమిటో విద్యాశాఖ అధికారులు ప్రజలకు స్పష్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత, పాఠశాల ప్రతిష్ఠకు సంబంధించిన అంశంలో జాప్యం లేకుండా పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని కోరుతున్నారు.




# నిరంకుశ పాలనపై "నిజం గెలిచింది"

## చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు సందర్భంగా తన ఇంటిపై కొవ్వొత్తులు వెలిగించి నిరసన ..!

## టీడీపీ హుజూర్ నగర్ నియోజకవర్గ నాయకులు మండవ వెంకటేశ్వర్లు గౌడ్

**శుభోదయ డైనమిక్ న్యూస్, హుజూర్ నగర్:** నిజానికి అవినీతి మరకలు అంటించేందుకు కుట్రలు చేశారని, అక్రమ కేసులో చంద్రబాబు నాయుడు పేరును అక్రమంగా ఇరికించి, ఆయన చేయని తప్పును చేసినట్లుగా ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నించారని తెలుగుదేశం పార్టీ హుజూర్ నగర్ నియోజకవర్గ నాయకులు మండవ వెంకటేశ్వర్లు గౌడ్ ఆరోపించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు మూడేళ్లు అయిన సందర్భంగా నారా లోకేష్ పిలుపుమేరకు బుధవారం తన ఇంటిపై కొవ్వొత్తులను వెలిగించి బ్లాక్ డే పాటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసి, నిజాన్ని నిర్బంధించడం ద్వారా జగన్ తమ ఐదేళ్ల అసమర్థ పాలనను కప్పిపుచ్చాలని ప్రయత్నించారని ఆయన విమర్శించారు. 'చంద్రబాబు నాయుడికి అన్యాయం చేసి, అర్ధరాత్రి అరెస్టు చేసి నిర్బంధించినా.. నిజాన్ని శాశ్వతంగా అణచివేయలేరు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కుయుక్తులు పన్నినా అంతిమంగా సత్యమే గెలుస్తుంది" అని మండవ వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. 'చీకటిని చీల్చుకుంటూ నిజం నిప్పులా నిలబడింది.. నిజమే గెలిచింది" అని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు న్యాయం కోసం చేసిన పోరాటం ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనమని మండవ వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. రాజకీయ కక్ష సాధింపులు, అక్రమ కేసులు, వేధింపులతో సత్యాన్ని ఎక్కువ కాలం అణచివేయడం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం, న్యాయం, సత్యం చివరకు విజయం సాధిస్తాయని,



చంద్రబాబు నాయుడిపై జరిగిన అన్యాయానికి ప్రజలే చరిత్రలో సమాధానం చెప్పారని మండవ వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. 'నిజాన్ని నిర్బంధించవచ్చు.. కానీ నిజాన్ని ఓడించలేరు. కాలం గడిచినా సత్యం వెలుగులోకి వస్తుంది. అదే జరిగింది. నిజమే గెలిచింది.. న్యాయమే నిలిచింది" అని ఆయన అన్నారు.

# మేడ్చల్ హస్మత్‌పేట్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

**మేడ్చల్--మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 10 శుభోదయ డైనమిక్:**హస్మత్‌పేట్‌లోని మండల పరిషత్ హైస్కూల్‌ను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె. ఆనంద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం, మధ్యాహ్న భోజనం పోషక విలువలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని ఆహార నిల్వ రిజిస్టర్లను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ, వంటకు ఉపయోగిస్తున్న కూరగాయల నాణ్యతను పరిశీలించారు. వంటగది పరిసరాలను స్వయంగా తనిఖీ చేసి, భోజనం తయారీ సమయంలో పాటిస్తున్న పరిశుభ్రత ప్రమాణాలను సమీక్షించారు.

పాఠశాల పరిసరాల పారిశుద్ధ్యాన్ని పరిశీలించిన ఆయన, విద్యార్థుల వినియోగించే వాష్‌రూమ్‌లు, ఇతర సౌకర్యాల వద్ద అపరిశుభ్రతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వాష్‌రూమ్‌లను నిరంతరం శుభ్రంగా ఉంచాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. అపరిశుభ్రమైన వాష్‌రూమ్‌ల కారణంగా విద్యార్థుల్లో వ్యాధులు వ్యాప్తి చెందే



ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. అనంతరం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం బృందాలు నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని డాక్టర్ ఆనంద్ పరిశీలించారు. విద్యార్థుల వైద్య పరీక్షల రికార్డులను సమీక్షించి, తీవ్ర పోషకాహార లోపం మితమైన పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించడం, నమోదు చేయడం, వారికి అందిస్తున్న ఫాలోఅప్ వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది తరగతి



గదుల్లో విద్యార్థులతో నేరుగా మాట్లాడి చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యాధుల నివారణకు పరిశుభ్రతే కీలకమని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంలో ఎలాంటి రాజీ లేకుండా పాఠశాల నిర్వాహకులు, సిబ్బంది పరిశుభ్రత విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ఆనంద్ సూచించారు.

# గ్రామాభివృద్ధే ప్రధాన అజెండా

## సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ

**మునగాల, శుభోదయ డైనమిక్** నర్సింహాపురం గ్రామ పంచాయతీ అభివృద్ధే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నామని సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ తెలిపారు.గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం వీధులు, డ్రైనేజీల వెంట ఉన్న గడ్డి, పిచ్చి మొక్కల తొలగింపునకు గడ్డి మందు పిచికారీ కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. డ్రైనేజీల్లో మురుగు తొలగింపు, తడి--పొడి చెత్త సేకరణ, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నిల్వ నీటిని తొలగించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.నీటి సమస్యలు తలెత్తకుండా నూతన విద్యుత్ మోటారు ఏర్పాటు చేశామని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామస్తులు పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలరాజు, వార్డు సభ్యుడు మీసాల బిక్షం, గ్రామ పెద్దలు కేసగాని వెంకన్న, రేపూరి బాబు, యువత, మహిళలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



**నేరేడుచర్ల, సెప్టెంబర్ 10,శుభోదయ డైనమిక్ వార్త** నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెం గ్రామంలో గురువారం పోషణ్ మేళా నిర్వహించారు. పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలతో పోషకాహారం తయారీపై అవగాహన కల్పించారు.

**పోషకాహార వంటకాల ప్రదర్శన**

చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల పోషకాహార వంటకాలను ప్రదర్శించారు. వీటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వివరించారు.

**గర్భిణులు, బాలింతలు, పిల్లల పాల్గొనడం**

కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయ, వార్డు కౌన్సిలర్ నన్నెపంగ శ్రీనివాస్‌తో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

# యల్లంకి సైదులు దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**శుభోదయ డైనమిక్ న్యూస్** మోతె సెప్టెంబర్ 10 మోతే మండల కేంద్రానికి చెందిన యల్లంకి సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి దశదిన కర్మ కార్యక్రమం గురువారం మోతె లోని స్వస్తిక్ ఫంక్షన్ హాల్ నందు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, సైదులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారులు యల్లంకి సుధీర్, సుధాకర్ మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.వారి వెంట మాజీ ఎంపీపీ ఆరె లింగారెడ్డి,బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు దేవుల నాయక్, జిల్లపల్లి ముత్తయ్య,ఇండ్ల వెంకటేశం, చంటి,నవీన్, తరుణ్. కరుణాకర్,అప్పల వెంకన్న, బొల్ల రామ్మలు తదితరులు పాల్గొన్నారు.

# పారా లీగల్ వాలంటీర్లకు డీఎల్ఎస్ఏ కీలక అవగాహన సమావేశం






**మేడ్చల్--మల్కాజిగిరి, సెప్టెంబర్ 10 శుభోదయ డైనమిక్** :ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు ఆదేశాల మేరకుమేడ్చల్--మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కుషాయిగూడలో పారా లీగల్ వాలంటీర్ల కోసం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక న్యాయ సేవాధికార సంస్థ చట్టం యొక్క ప్రధాన లక్ష్యాలు, ఉద్దేశాలను వివరించారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండేలా చూడటంలో న్యాయ సేవాధికార సంస్థ పోషిస్తున్న కీలక పాత్రను వివరించారు. అలాగే పారా లీగల్ వాలంటీర్ల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. న్యాయ వ్యవస్థకు, ప్రజలకు మధ్య సమర్థవంతమైన వారధులుగా పారా లీగల్ వాలంటీర్లు పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహిస్తున్న నెలవారీ కార్యకలాపాలను సమీక్షించడంతో పాటు, రాబోయే ప్రజా అవగాహన కార్యక్రమాలపై కూడా చర్చించారు. ఈ ఇంటరాక్టివ్ సమావేశంలో మొత్తం 15 మంది పారా లీగల్ వాలంటీర్లు చురుకుగా పాల్గొన్నారు.

# మునగాలలో ఉచిత ప్రకృతి వైద్య శిబిరం



**శుభోదయ డైనమిక్ న్యూస్** -- మునగాల అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్.వి. ప్రసాద్ పర్యవేక్షణలో మునగాలలోని వాసవి భవన్‌లో ఉచిత ప్రకృతి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు.డాక్టర్ వైష్ణవి ఆధ్వర్యంలో ఆక్యుప్రెషర్, సుజోక్, కప్పింగ్, వైబ్రేషన్ వంటి చికిత్సా విధానాలతో మోకాళ్లు, నడుము, మెడ, కీళ్ల నొప్పులు, తలనొప్పి తదితర సమస్యలకు సేవలు అందిస్తున్నారు. శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఎల్.వి. ప్రసాద్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తహసీల్దార్ కార్యాలయానికి తాళం!

పదేళ్లుగా అద్దె భవనంలో సేవలందిస్తున్న అధికారులు

రెండేళ్లుగా అద్దె చెల్లించడంలేదని యజమాని ఆరోపణ




**శుభోదయ డైనమిక్,**పాలకీడు మండల తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసిన ఘటన పాలకీడు మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకెలితే గత పదేళ్లుగా అద్దె భవనంలో రెవెన్యూ అధికారులు ప్రజలకు సేవలందిస్తున్నారు.కాగా రెండు సంవత్సరాల నుండి అద్దె చెల్లించడం లేదని అరోపిస్తూ ఇంటి యజమాని జనార్దన్‌రెడ్డి తాళం వేశారు. ఈ సమస్యపై కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, జాయింట్ కలెక్టర్‌ను కలిసినా అధికారులు జీవో పేపర్లు అడుగుతున్నారని ఆయన తెలిపారు.అద్దె బకాయిలు చెల్లించే వరకు తాళం తీయబోనని ఆయన స్పష్టం చేయడంతో కార్యాలయ పనులకు ఆటంకం ఏర్పడింది. దీనివల్ల కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## క్లీన్ ఇండియా వ్యాసరచనలో విజయశ్రీ ప్రథమం




**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** మై భారత్ కేంద్రం, సూర్యాపేట జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన క్లీన్ ఇండియా వ్యాసరచన పోటీల్లో నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విజయశ్రీ ప్రథమ, కార్తిక్ ద్వితీయ, సమీరా తృతీయ, ఏకశ్రీ నాలుగో బహుమతి సాధించారు.కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వనపర్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విజేతలకు అభినందనలు తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటరమణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మై భారత్ వాలంటీర్ బి. రవీందర్, డా. సైదులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకుముందు విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు.

## వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్త



**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** మండలంలోని పెంచికల్ దిన్నె గ్రామంలో వల్లంశెట్ల కృష్ణయ్యకు చెందిన వరి పొలాన్ని కేవీకే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త నరేష్, మండల వ్యవసాయ అధికారితో కలిసి గురువారం పరిశీలించారు.వరి విత్తనాలు వెదజల్లిన 15 నుంచి 20 రోజుల తర్వాత మొక్కలు చనిపోతున్నాయని రైతు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణలో భాగంగా పొలాన్ని పరిశీలించారు. మొక్కలు చనిపోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు పంట పరిస్థితిని పూర్తిగా పరిశీలించారు.క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించిన నివేదికను త్వరలో జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పిస్తామని సీనియర్ శాస్త్రవేత్త నరేష్ తెలిపారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి

బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు



**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్** చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. నేరేడుచర్లలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. బీసీలతో పాటు అన్ని వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు నిజమైన నివాళి అని అన్నారు.కార్యక్రమంలో కొమరాజు వెంకట్, యశోద రాములు, ముత్యాల భాస్కర్, ఊదర వెంకన్న, ఎస్‌కే సయ్యద్ పాషా, రెడ్డిపల్లి వినయ్, కేతవరపు రాంప్రసాద్, మొగరాల ఉదయ్, శివ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు పోలీసుల నివాళి



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** జిల్లా పోలీస్ కార్యాలయంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ కె. నరసింహ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్యాయానికి, అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎస్పీ అన్నారు. ఆమె ధైర్యం, పట్టుదల, త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో ?1 లక్ష విలువైన గంజాయి స్వాధీనం



**మేడ్చల్--మల్కాజిగిరి, సెప్టెంబర్ 10 శుభోదయ డైనమిక్:** విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు గురువారం కూకట్‌పల్లిలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి సుమారు ?1 లక్ష విలువైన 256 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలించేందుకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని కూడా అధికారులు సీజ్ చేశారు. అరెస్టైన వ్యక్తిని ఆర్. ప్రసాద్ (33)గా గుర్తించారు. ఎక్సైజ్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, నార్కోటిక్స్ నెట్‌వర్క్‌లపై శాఖ అధికారులు దాడులను ముమ్మరం చేశారు. తాజా గంజాయి స్వాధీనం కూడా అక్రమ మాదకద్రవ్యాల వ్యాపారాన్ని అరికట్టేందుకు కొనసాగుతున్న చర్యల్లో భాగమని తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్ర వాహనం, నిందితుడిని తదుపరి దర్యాప్తు మరియు చట్టపరమైన చర్యల నిమిత్తం కూకట్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు.

## ఐడీఎల్ చెరువును పరిశీలించిన సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన



**మేడ్చల్--మల్కాజిగిరి, సెప్టెంబర్ 10 శుభోదయ డైనమిక్ :** గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా, సురక్షితంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) కమిషనర్ సృజన, ఐఏఎస్ గురువారం ఐడీఎల్ చెరువును సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్‌తో పాటు ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్, అదనపు కమిషనర్ (హెల్త్ అండ్ శానిటేషన్), కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, సూపరింటెండింగ్ ఇంజనీర్‌తో పాటు కూకట్‌పల్లి జోన్‌కు చెందిన వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఐడీఎల్ చెరువు వద్ద కొనసాగుతున్న సివిల్ ఇంజినీరింగ్, పారిశుధ్యం, ఆరోగ్యం, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు కమిషనర్‌కు వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో చేపడుతున్న పనుల పురోగతిని ఆమె పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు, ఆరోగ్య, పారిశుధ్య విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు ఐడీఎల్ చెరువు వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, భద్రతా చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను కమిషనర్ సృజన ఆదేశించారు.

## కనకదుర్గ అమ్మవారిని చిన్నచూపు చూడొద్దు



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్** హుజూర్‌నగర్ పీర్ల కొట్టం బజారులోని పురాతన కనకదుర్గ అమ్మవారి ఆలయానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. ముత్యాలమ్మ జాతరకు ముందు కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయం ప్రకారం మేకపోతును సమర్పించడం దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ అని వారు తెలిపారు. ఈసారి కార్యక్రమాన్ని తూతూమంత్రంగా ముగించారనే విమర్శలు భక్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి. "అమ్మవారి కళ్లుతెరవకముందే ముత్యాలమ్మ కమిటీ సభ్యులు కళ్లుతెరవాలి" అంటూ వారు వ్యాఖ్యానించారు.జాతర సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా ఆలయంలో ధూపదీప నైవేద్యాలు, పరిశుభ్రత, మౌలిక వసతులు, ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో ముత్యాలమ్మ కమిటీ భాగస్వామ్యం కావాలని స్థానికులు డిమాండ్ చేశారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలను భక్తిశ్రద్ధలతో కొనసాగించి కనకదుర్గ అమ్మవారికి తగిన గౌరవం కల్పించాలని కోరారు.

## న్యాయవాద వృత్తిలో ప్రతిభకు కాళోజి నంది అవార్డు...

యరగాని సోనీకి అభినందనల వెల్లువ



**శుభోదయ డైనమిక్ న్యూస్**, హుజూర్‌నగర్, సెప్టెంబర్ 10 హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన యువ న్యాయవాది, నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ యరగాని సోనీ ప్రతిష్టాత్మక కాళోజి నంది అవార్డును అందుకున్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని కాళోజి తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్ అసోసియేషన్, కాళోజి తెలంగాణ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. జూనియర్ న్యాయవాదిగా ఆమె కనబరిచిన ప్రతిభ, వృత్తిపట్ల అంకితభావాన్ని గుర్తించి కమిటీ ఏకగ్రీవంగా సోనీని అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సోనీ తల్లిదండ్రులు యరగాని సత్యనారాయణ గౌడ్, ఉమా, కుటుంబ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు. న్యాయవాద వృత్తిలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి



**హుజూర్‌నగర్,శుభోదయ డైనమిక్** తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్రను స్మరించుకుంటూ ఆమె విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని పట్టణ లాండ్రీ షాప్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఇందిరాల నరసయ్య కోరారు. గురువారం పాత బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టడంతో పాటు పాలకుర్తిలో ఆమె పేరుతో స్మృతివనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వడ్లనపు శ్రీనివాస్, దుగ్గి బ్రహ్మం, రేపాకుల మురళి, అలవాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి




**శుభోదయ డైనమిక్ ,మోతే** యువతకు శాశ్వత ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సూర్యాపేటలో జరిగిన డివైఎఫ్ఐ జిల్లా 2వ మహాసభలో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఉద్యోగాల భర్తీ కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని తెలిపారు.నూతన కమిటీ: జిల్లా అధ్యక్షుడిగా సానబోయిన ఉపేందర్, కార్యదర్శిగా బోయిళ్ల నవీన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎలుగు మధు, నన్నెపంగు రమేష్, మీసాల వీరబాబు, బచ్చలకూరి సురేందర్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా వేల్పుల ఉతేజ్, తుమ్మ సతీష్, గొబ్బి రాము, జంగంపల్లి సాయికుమార్ తదితరులు ఎన్నికయ్యారు.

## ఎలుగు మధు డివైఎఫ్ఐ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవ ఎన్నిక




**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతే** సెప్టెంబర్ 10 డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ) సూర్యాపేట జిల్లా రెండో మహాసభలో ఎలుగు మధు జిల్లా ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభలో ప్రతినిధులు ఏకగ్రీవంగా నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఎలుగు మధు గతంలో డివైఎఫ్ఐ మోతె మండల కార్యదర్శిగా యువజన సమస్యలపై, విద్యార్థులు--యువత హక్కుల కోసం పలు కార్యక్రమాలు, ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. యువతను సంఘటితం చేస్తూ ప్రజా సమస్యలపై పోరాటాల్లో ముందుండి పనిచేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా తనను ఎన్నుకున్న డివైఎఫ్ఐ ప్రతినిధులకు, నాయకత్వానికి ఎలుగు మధు కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తు లో యువత సమస్యల పరిష్కారం కోసం, నిరుద్యోగం, విద్య, ఉపాధి వంటి అంశాలపై మరింత కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఎలుగు మధు ఎన్నిక పట్ల డివైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు, యువత హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## వినాయక మండపాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి



**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతే సెప్టెంబర్ 10 మోతే**: డీజీపీ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం మోతే మండల వ్యాప్తంగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్న కమిటీల సభ్యులతో ఎస్ఐ బి. లచ్చి రెడ్డి సమావేశం నిర్వహించారు. మండపాల ఏర్పాటులో పాటించాల్సిన నిబంధనలు, భద్రతా చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను కమిటీ సభ్యులకు వివరించారు. మండపాల వద్ద విద్యుత్ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించడంతో పాటు ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా, సౌహార్ద వాతావరణంలో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు. నిబంధనలకు అనుగుణంగా మండపాల నిర్వహణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో పోలీసు సిబ్బంది, మండలంలోని వివిధ వినాయక మండపాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సుదర్శన నర్సింహా సాహిత వెంచర్ల ఏర్పాటు



**కోదాడ శుభోదయ డైనమిక్ వార్త** సెప్టెంబర్ 10 కోదాడ నియోజకవర్గం...కోదాడ పట్టణ పరిధిలోని శ్రీనివాసా వెంచర్ నందు ఏర్పాటుచేసిన సుదర్శన నారసింహా సహిత శ్రీ మహాలక్ష్మి యాగం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన లికోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ఈ వెంచర్ బాగా అభివృద్ధి చెంది లాభాలు జరగాలని కోరారు

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA